క్లుప్తంగా

గౌరీపరమేశ్వరులకు కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, మహిళలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని లలితా గౌరీ మహిళా సంఘం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన కుంకుమ పూజల్లో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ భక్తులందరికీ గౌరీపరమేశ్వరుల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ నెల 4న గౌరీకల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సూరిశెట్టి అప్పలకొండ, సూరిశెట్టి అచ్చుతరామ్, కాండ్రేగుల నాగరాజు, శరకం రాజు, శరకం సూరిబాబు, కంద్రపు బ్రహ్మాజీ, రెడ్డి వెంకటరమణ, కట్ట రాము, లలితా గ్రూప్ సభ్యులు, బుల్లెట్ బాయ్స్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోర్టుకు అదనపు హంగులు



బ్యాడ్మింటన్ కోర్టులో వేసిన నాన్ స్కిడ్ పెయింట్

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వేదిక ప్రాంగణం ఎదురుగా బ్యాడ్మింటన్ కోర్టుకు అదనపు హంగులు ఏర్పాటు చేశారు. ఇక్కడ రెండు కోర్టులు ఉన్నాయి. ఇవి గచ్చుతో నిర్మించినవి కావడంతో ఆడేటప్పుడు క్రీడాకారులు జారి గాయాల పాలవుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నాన్ స్కిడ్ పెయింట్ వేశారు. దీంతో క్రీడాకారులకు ఇబ్బందులు తొలగించగలిగామని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ చెప్పారు.

అవగాహనతోనే ఎయిడ్స్ దూరం



బుల్లయ్య కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సీతంపేట: ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక బుల్లయ్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వి.సిహెచ్.శ్రీకాంత్, కార్యనిర్వహణ అధికారి ఎస్.కె.గౌసిబాబు, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, అసిస్టెంట్ డీన్ డి.దీనబంధు మాట్లాడుతూ అవగాహనతోనే ఎయిడ్స్, హెచ్ఐవీ బారిన పడకుండా ఉండవచ్చని పేర్కొన్నారు. కలుషితమైన సిరంజిలు, సూదుల వల్ల ఎయిడ్స్ వ్యాధి బారిన పడే అవకాశం ఉందని, ఆరోగ్యవంతమైన అలవాట్లు కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్లు ఆలోచింపజేశాయి.

మార్ఫింగ్ వీడియోలు పోస్ట్ చేస్తున్న అడ్వకేట్ అరెస్ట్

ఎంవీపీ కాలనీ: సోషల్ మీడియాలో వివాహితను టార్గెట్ చేస్తూ మార్ఫింగ్ వీడియోలు పోస్ట్ చేస్తున్న వ్యక్తిని విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. నగరానికి చెందిన వివాహితతో ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలికి చెందిన అడ్వకేట్ గేదెల విజయబాబుకు ఒక కేసు విషయంలో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆమెను లోబరుచుకున్న విజయబాబు సన్నిహితంగా ఉన్నప్పుడు ఆమెకు తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీశాడు. వాటిని కొద్దిపాటి మార్ఫింగ్‌లతో సోషల్ మీడియాలో పెట్టి వేధింపులకు దిగాడు. ఆ వివాహిత సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో విజయబాబును నిందితుడిగా గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేశారు.



నాడు: స్టాల్స్‌లోకి వర్షపు నీరు రాకుండా ఏర్పాటు చేసిన గోనెలు



నేడు: స్టాల్స్ పైకప్పుగా కొత్తగా వేసిన అల్యూమినియం రేకులు



నరసింహనగర్ రైతుబజార్ ప్రవేశ ద్వారం

రైతుబజార్లకు కొత్తకళ

- 'నాడు–నేడు పనులతో' ఆధునికీకరణ
- మౌలిక సదుపాయాల కల్పన
- రైతులు, వినియోగదారుల హర్షం

రైతుబజార్ల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతోంది. నాడు రైతుబజార్ల దుస్థితి ఘోరంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాటికి మహర్దశ పట్టింది. లక్షల రూపాయల నిధులతో రైతుబజార్లను సకల సదుపాయాలతో ఆధునికీకరిస్తూ రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారు.

సీతంపేట: ప్రజలకు నాణ్యమైన కూరగాయలను చౌకగా అందించే రైతు బజార్లలో నాడు–నేడు కార్యక్రమం కింద ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అరకొర సదుపాయాలతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుబజార్లలో స్టాళ్లకు పైకప్పుగా వేసిన సిమెంట్ రేకులు రంధ్రాలు పడి వర్షా కాలంలో నీరు లీకై ఇబ్బందులు పడేవారు. టాయిలెట్లలో పాడైన ట్యాప్‌లు, బేసిన్లు, శిథిలమైన వాటర్ ట్యాంకు, పాడైన గోడలు, స్టాల్స్ మధ్య విరిగిన గోడలు, గుంతలు పడిన గచ్చులు ఇలా ఎన్నో సమస్యలతో రైతుబజార్లలో సిబ్బంది, రైతులు, వ్యాపారులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. వీటిపై దృష్టి సారించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద నిధులు మంజూరు చేసి రైతుబజార్లను ఆధునికీకరిస్తోంది. రైతుబజార్లతో సమస్యలు తొలగిపోవడంతో రైతులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నరసింహనగర్ రైతుబజార్ విశేషాలు

రైతుబజార్ విస్తీర్ణం	: 25 సెంట్లు
ప్రారంభించిన సంవత్సరం	: 2001
అప్పట్లో స్టాళ్ల సంఖ్య	: 129
ప్రస్తుతం స్టాళ్ల సంఖ్య	: 152
నమోదు చేసుకున్న రైతుల సంఖ్య	: 195
రోజూ వస్తున్న రైతుల సంఖ్య	: 120 నుంచి 130 మంది

చూడముచ్చటగా సీతమ్మధార రైతుబజార్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌ను చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. 12 స్టాళ్లకు టైల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు స్టాళ్లకు టైల్స్ పూర్తి చేశారు. విద్యుత్ లైన్‌తోపాటు లైట్లు, రంగులు, ప్రధాన ద్వారం వద్ద బోర్డు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు, బజారు వెనుక మురుగు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ పనులు చేస్తున్నారు. గతంలో మార్కెటింగ్ శాఖ సీఈవో నందకిశోర్ నగరంలోని రైతుబజార్లలో తనిఖీలు చేసిన నేపథ్యంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నగరంలోని 13 రైతుబజార్ల అభివృద్ధికి నిధులు విడుదల చేశారు.



సీతమ్మధార రైతుబజార్ స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన టైల్స్



టాయిలెట్‌కు నీరు సరఫరా చేసేందుకు కొత్త వాటర్ ట్యాంకు



రైతుబజార్‌లోని ఆర్వో ప్లాంట్ రూమ్‌కు కొత్తగా ఏర్పాటు చేసిన గేటు

రూ.15 లక్షలతో నరసింహనగర్ రైతుబజార్ అభివృద్ధి

- నాడు-నేడు పనుల్లో భాగంగా నరసింహనగర్ రైతుబజార్‌లో రూ.15 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టారు.
- బజార్‌లో 6 బ్లాకుల్లో ఉన్న 152 స్టాళ్లపై పైకప్పుగా ఉన్న సిమెంట్ రేకులను తొలగించి కొత్తగా అల్యూమినియం రేకులు వేశారు.
- స్టాళ్ల మధ్య విరిగిన గోడలను పునర్నిర్మించారు.
- టాయిలెట్లకు మరమ్మతులు చేసి, కొత్త వాటర్ ట్యాంకు ఏర్పాటు చేశారు.
- పాడైన గోడలు, ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేపట్టారు.
- విద్యుత్ వైరింగ్ చేసి ప్రతి స్టాల్‌కు లైట్, ఎలక్ట్రానిక్ కాటా చార్జింగ్ చేసుకునేలా ప్లగ్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఆర్వో ప్లాంట్ రూమ్‌కు మరమ్మతులు చేశారు.

'నాడు-నేడు'తో సదుపాయాలు



నరసింహనగర్ రైతుబజార్‌లో సరైన సదుపాయాలు లేక చాలా ఏళ్ల నుంచి రైతులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుబజార్‌లో సమస్యలు గుర్తించి నాడు-నేడు కింద నిధులు మంజూరు చేయించడంతో మరమ్మతులు చేపట్టారు. ఇపుడు చాలా సౌకర్యంగా ఉంది.

– పి.చినబాబు, ఎస్టేట్ ఆఫీసర్

ఇబ్బందులు తొలగాయి



స్టాల్స్ పైకప్పుగా వేసిన సిమెంట్ రేకులకు రంధ్రాలు, పగుళ్లు పడటంతో వర్షం పడితే నీరు లీకై కూరగాయలు, బియ్యం తడిసి పాడైపోయేవి. ఇపుడు అల్యూమినియం రేకులతో పైకప్పు వేశారు. చాలా సురక్షితంగా ఉంది. అన్ని రకాల సదుపాయాలు కల్పించడంతో రైతుబజార్‌లో ఇబ్బందులు తొలగిపోయాయి.

– జనపరెడ్డి శ్రీను, రైతు, మర్రివలస

విద్యుత్ సదుపాయం కల్పించారు



వర్షం పడితే రైతుబజార్‌లో చాలా ఇబ్బందులు పడేవారం. గోడలు, గచ్చులు పాడయ్యాయి. కాటాలకు చార్జింగ్ పెట్టుకోవడానికి సరైన ప్లగ్ పాయింట్ లేక ఇబ్బంది ఎదురయ్యేది. కొద్ది నెలల కిందట బజార్‌లో మరమ్మతులు చేపట్టారు. ప్రతి స్టాల్‌కు విద్యుత్ సదుపాయం కల్పించారు.

– మేడిశెట్టి మంగ, మహిళా రైతు, తీడ గ్రామం

ప్రతి ఇంటా సంక్షేమ బావుటా

- జగనన్న పాలనలో అన్ని వర్గాలకూ మేలు
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



51వ వార్డులో పార్టీ జెండాను ఎగురవేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



సీతంపేట సచివాలయం వద్ద పార్టీ జెండా ఎగురవేస్తున్న కె.కె.రాజు



47వ వార్డులో కిట్లు అందిస్తున్న కె.కె.రాజు

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో అందించిన సంక్షేమం, అభివృద్ధితో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో శుక్రవారం సీతంపేట 130 సచివాలయం పరిధిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పార్టీ జెండాను, సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, పార్టీలను చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నరని తెలిపారు. సీతంపేట సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.21.82 కోట్లు లబ్ధిదారులకు నగదు సాయం అందిందన్నారు. సచివాలయం పరిధిలో సుమారు రూ.2 కోట్ల విలువైన రోడ్లు, డ్రెయిన్లు వంటి అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ జి.వి.రమణి, కనకమహాలక్ష్మి ఆలయ బోర్డు మెంబర్ సానబోయిన సురేష్, డైరెక్టర్ నూకరాజు, కన్వీనర్లు, స్థానిక నాయకులు వానపల్లి లక్ష్మణకుమార్, నంబూరు పద్మ, పువ్వాడ గోవిందమ్మ, వాడవీరమ్మ, డి.కోటేశ్వరరావు, ముద్దాడ అశోక్, బోగవిల్లి గోవింద్, ఉప్పల శేఖర్, ఉప్పిలి అప్పన్న, గుడివాడ గౌరినాయుడు, ఉప్పాడ సన్నీ, స్థానిక మహిళలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు 259 సచివాలయం పరిధి కప్పరాడలో కార్పొరేటర్ కె.కామేశ్వరి నేతృత్వంలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పరిపాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. 2024లో మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి కటుమూరి సతీష్, కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, కె.గురువోజీ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, సీవోలు, ఆర్పీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మహత్ కాలనీ 288 సచివాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. అందుకే ఆయనను మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టరు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, దిడ్డి రమేష్, బి.తిరుమలరావు, మెట్ట దమయంతి, కరిమిరెడ్డి శ్యామ్, లక్ష్మణ్, వరలక్ష్మి, ధర్మవతి, రత్నం, లత, రాణి, మహత్ కాలనీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



కంచరపాలెంలో పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ అరుణకుమారి, సచివాలయ కన్వీనర్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ధనలక్ష్మి

- జోన్-5లో 80 శాతం పూర్తి

కంచరపాలెం: నియోజకవర్గంలో శుక్రవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా జరిగింది. జీవీఎంసీ జోన్-5 పరిధిలోని ఉత్తర, పశ్చిమ నియోజవర్గాలకు సంబంధించిన 24 వార్డుల్లో టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. మొత్తం 27,461 మంది పింఛన్‌దారులకు గాను తొలి రోజు 20,216 మందికి అందించారు. సుమారు రూ.7,77,55,000 నగదు పెన్షనర్లకు విడుదలైంది. 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేసినట్లు యూసీడీ ఏపీడీ పద్మావతి తెలిపారు. ఇళ్లకే కాకుండా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛను నగదు అందజేశారు. శనివారానికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కృష్ణ తెలిపారు.

హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ అందజేత

తాటిచెట్లపాలెం: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ పెద్దాయన వద్దకు వెళ్లి నేరుగా పింఛన్ సొమ్ము అందించడంతో ఆయన ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. 45వ వార్డు 255 సచివాలయం పరిధి ఏఎస్సార్ నగర్‌కు చెందిన నాగయ్య గుండెనొప్పితో అకస్మాత్తుగా మూడు రోజుల కిందట మెడికవర్ హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ బి.ధనలక్ష్మి నేరుగా హాస్పిటల్‌కు వెళ్లి నాగయ్యకు పింఛన్ అందజేసింది. దీంతో లబ్ధిదారుడి కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఈవో బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవ వేంకటేశ్వరుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

జాబ్‌మేళాకు స్పందన



అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), శాంతి(టెక్నికల్) తెలిపారు. 8 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 345 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 101 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 42 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్పారు. ఉద్యోగాలు పొందిన వారికి ఎంప్లాయిమెంట్ అధికారులు నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలకు ఎంతో కృషి చేస్తోందని సుబ్బిరెడ్డి అన్నారు. నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధునిక వైద్యంతో ఎయిడ్స్‌పై విజయం



వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

కంచరపాలెం: ఆధునిక వైద్యంతో ఎయిడ్స్ వ్యాధిపై విజయం సాధించవచ్చని పద్మశ్రీ అవార్డు పురస్కార గ్రహీత, వైద్య నిపుణుడు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులోని కూటికుప్పల సూర్యారావు హాస్పిటల్‌లో మల్టీ స్పెషాలిటీస్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1న 'లెట్ కమ్యూనిటీ లీడ్' అనే నినాదంతో పనిచేస్తున్నామన్నారు. ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో సుమారు 565 మందికి వివిధ రకాల వైద్య, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ డి సుభాదేవి, డాక్టర్ అచ్యుతరావు, డాక్టర్ కె.అశ్విని, డాక్టర్ సురేష్, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ మధుకర్, డాక్టర్ హెచ్.హుస్సేన్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

మర్రిపాలెం: శ్రీదేవి భూదేవి సహిత శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆర్ అండ్ బీ దరి కేవీఎస్ఆర్ గ్రీన్ వ్యాలీలోని శ్రీరామ మందిరం ప్రాంగణంలో ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఈ వేడుక జరిగింది. సెంచూరియన్ యూనివర్సిటీ డైరెక్టర్ డి.ఎస్.రావు పాల్గొని కల్యాణం జరిపించారు. కార్తీక మాసం సందర్భంగా లోక కల్యాణార్థం వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు అసోసియేషన్ సభ్యులు ఈ సందర్భంగా తెలిపారు. అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వారంతా అసోసియేషన్ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులు, కోచ్‌లను పరిశుభ్రంగా ఉంచండి

- డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్



తాటిచెట్లపాలెం: రైలు ప్రయాణికులకు సుఖవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు వాల్తేర్ డివిజన్, భారతీయ రైల్వే కృషి చేస్తోందని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా ప్రవేశపెట్టిన నూతన కోచ్‌లను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయాణికులు సహకరించాలని ఆయన కోరారు. కొంతమంది సంఘవిద్రోహశక్తులు రైల్వే కోచ్‌లను పాడుచేస్తున్నారని, ఇది ప్రజలందరి ఆస్తని, వీటిని సంరక్షించుకోవలసిన బాధత్య అందరిపైనా ఉందన్నారు. రైళ్లు, రైల్వే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, అందుబాటులో ఉన్న సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. ఇటీవల నూతనంగా ప్రారంభించిన విశాఖపట్నం–వారణాసి రైలును కొందరు సంఘవిద్రోహశక్తులు చాలా వరకు నష్టపరిచారని, వీటి వల్ల ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. ప్రయాణికులు ఇది తమ భాద్యతగా గుర్తించాలని, ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే రైల్వే అధికారలకు తెలియజేయాలని డీఆర్ఎం కోరారు.